

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు 'శ్రీవేద' విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె : పట్టణంలోని శ్రీవేద పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జి.భవన్ సాయి చంద్ర కుమార్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అంతర్ జిల్లా పోటీల్లో మొదటి స్థానం సాధించిన భవన్ సాయి చంద్ర, జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ నవంబర్ 29 నుంచి గుంటూరులో ప్రారంభం కానుండగా, చిత్తూరు జిల్లా తరపున మంచి ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లలో భవన్ సాయి చంద్ర ఒకడిగా నిలిచాడన్నారు. ఈ విజయంపై పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, ఛైర్మన్ రామమోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్ర రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఎఒలు శ్రీకిషోర్, నాగరాజు, కోచ్ రెడ్డి రాఘవేంద్ర, పిఇటిలు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి భవన్ సాయి చంద్రకు అభినందనలు తెలిపారు.

ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయండి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-గాలివీడు

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని భారీ నీటిపారుదల, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం వెలిగల్లు ప్రాజెక్టు, పెద్దమండెం మండలంలోని దిగుపల్లి వద్ద ఉన్న హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం ద్వారా ప్రధాన కాలువ మొదటి పంపింగ్ స్టేషన్, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను పరిశీలించారు. వెలిగల్లు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు విస్తీర్ణం, ప్రస్తుతం నీటిమట్టం నిల్వ, గేట్ల పరిస్థితి, ప్రాజెక్టు వద్ద కంట్రోల్ రూమ్ కుడి, ఎడమ కాలువలు ద్వారా నీటి విడుదల ద్వారా ఎన్ని ఎకరాలు ఆయకట్టుకు నీరు అందుతున్నదని, తదితర విషయాలను భారీ నీటి పారుదల శాఖ, హెచ్ఎన్ఎస్-ఎస్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కర్ణాటకలోని నంది హిల్స్ పాపాగ్ని నుండి నీరు వస్తుందని దీనికి సంబంధించిన రూట్ మ్యాప్ ద్వారా ఏపి ప్రాంతానికి నీరు అందించడం జరుగుతున్నదో అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. వెలిగల్లు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 4.64 టిఎంసి కాగా ప్రస్తుతం నీటి నిల్వ 4.15 టిఎంసిలు ఉన్నాయని పేర్కొన్నారు. కుడి కాలువ ద్వారా 60 చెరువులకు నీరు అందించడం 23,400 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఎడమ కాలవ ద్వారా 9 చెరువులకు నీరు అందించి 600 ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సంబంధించి పూర్తి స్థాయిలో పునరుద్ధ రించడానికి అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఆయకట్టుదారులకు అందించేందుకు అవకాశాలను పరిశీలించాలని అధికారులకు తెలిపారు. హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం కింద పెద్దమండెం మండలం దిగువపల్లి గ్రామంలో శ్రీశైలం నుండి వచ్చే బ్యాక్ వాటర్‌ను మొదట ప్రధాన పంపింగ్ స్టేషన్ 4900/1.60 కిలోమీటరు వద్ద పంపింగ్ స్టేషన్, పంపింగ్ ద్వారా అయినా వాటర్ డెలివరీ పాయింట్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం శ్రీనివాసపురం రిజర్వాయర్ సామర్థ్యం 1.02 టిఎంసిలు కాగా, 28 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు అందించడానికి వీలవుతుందని, 2 ప్రధాన కాలువల పనులు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టు కింద భూమిని కోల్పోయిన రైతులకు పునరావాసం కల్పించామని, కాలవల బ్రిడ్జిలు పనులు, లైనింగ్ పనులు తదితర చిన్న చిన్న పనులు పెండింగ్లో ఉన్నవని అధికారులు తెలిపారు. ఈ పనులకు సంబంధించి నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లకు పిలిచి పనులను ప్రారంభించాలని ఆగస్టు 2026 లోపల అన్ని పూర్తి చేసే విధంగా చూడాలని, జిల్లాలో భూగర్భజలాల పరిమాణ స్థాయి పెంపుదలకు ప్రత్యేక దృష్టి సాధించాలని వాటి అనుగుణంగా జిల్లాలో తాగు, సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు పనిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఇ వెంకటరామయ్య, ఇరిగేషన్ ఇఇ భరత్ కుమార్, హెచ్ఎంఎస్ఎస్ అధికారి సి.రాజగోపాల్, డిఇలు, ఎఇలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


వెలిగల్లు ప్రాజెక్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పీలేరులో వర్షం..జలమయమైన బస్టాండు

ప్రజాశక్తి-పీలేరు

తుపాన్ కారణంగా పీలేరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల శబ్దాలు గగుర్పాటును పుట్టించాయి. చిన్నపాటి తుంపరతో మొదలైన వర్షం కాస్తా అంచెలంచెలుగా జోరందుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండులోకి వర్షపు నీరు చేరి, చూసేవారికి అది ఓ చిన్నపాటి నీటి కుంటను తలపిస్తోంది. మురుగునీటి కాలువల్లోకి చెత్తాచెదారాలు చేరడంతో, మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా పాదచారుల నడకకు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. కాస్త తెరపిస్తే పనులు చేసుకుందామని ఆశించే కూలీలకు ఈ వర్షం ఆటంకం కల్పిస్తోంది. వర్షం వస్తే ఓ బాధ, రాకుంటే మరో బాధని ప్రజలు తమ బాధలను వ్యక్తం చేస్తున్నారు. ఈ తుపాన్ ప్రభావం ఇలాగే ఈ నెల చివరి వరకూ ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో దినసరి కూలీలు తమ ఉపాధికి గండి పడే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. తమకు వరుణుడి కరుణ తప్ప వేరే మార్గం లేదని వారు సర్దుకుపోక తప్పడం లేదు.


బస్టాండ్‌లోకి చేరిన వరద నీరు

వ్యక్తులు ముఖ్యం కాదు.. వ్యవస్థ శాశ్వతం

- పిఎసి ఛైర్మన్ కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పిఎసి ఛైర్మన్ రవికుమార్

ప్రజాశక్తి-కడప

వ్యక్తులు ముఖ్యం కాదు, వ్యవస్థ మాత్రమే శాశ్వతమైనదని ప్రభుత్వ బాధ్యత ప్రతి అధికారిపై ఉందని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పియుసి) ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రవికుమార్ అధ్యక్షతన కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో యోగి వేమన విశ్వ విద్యాలయం, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఐఐఐటి ఇడుపులపాయ), రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, కడప స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, పులివెందుల ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా), కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా), ఎపి టూరిజం వైఎస్ఆర్ కడప రీజియన్, ఎపి సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ లిమిటెడ్ (ఎపి కార్ల్) సంస్థల నిర్వహణ, అభివృద్ధి, పురోగతిపై ఛైర్మన్ రవికుమార్ క్షుణ్ణంగా సమీక్షించారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లాలో అన్ని రంగాలకు పురోగమనంలోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయ సాధన దిశగా జిల్లాలో అభివృద్ధి అన్ని విధాలా సంతృప్తికరంగా సాగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో అన్ని రకాల సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, విద్యా వైజ్ఞానిక అంశాలు, నైపుణ్య అభివృద్ధిలో జిల్లా యువత ముందంజలో ఉందన్నారు. పిఎసి ఛైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యా సాంకేతిక పారిశ్రామిక మౌలిక అభివృద్ధిలో పురోగమనం వైపు అడుగులేస్తుండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో పురోగమనంలో జిల్లా ముందంజలో ఉన్నా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇంకా సంతృప్త స్థాయిలో అన్ని అంశాల్లో జిల్లాలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడంలో, అకడమిక్, నూతన అధ్యయన పరిశోధనలో రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపు పొందుతున్న యోగివేమన యూనివర్సిటీ శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, లలిత కళల అభివృద్ధికి మరించ ప్రాచుర్యం రావాలన్నారు. రెండు రోజులుగా జిల్లాలో పర్యటించిన కమిటీకి జిల్లా స్థితిగతులపై పూర్తి అవగాహన కలిగిందని, ఇప్పటివరకు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా కూడా మరింత పురోభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల్లో విధిగా ఆడిటింగ్ జరగాలన్నారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన అన్ని వనరులు ఉన్నాయని, అధికారులు పూర్తి బాధ్యత తీసుకుంటే జిల్లాకు అన్నీ సమకూరినట్లేనన్నారు. సమావేశంలో పిఎసి సభ్యులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా, జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాజశేఖర్, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విసి ఆచార్య జి.జయరామిరెడ్డి, ఆర్‌జియుకెటి ఇన్‌ఛార్జి విసి ఆచార్య విజయ్ కుమార్, ఎపి కార్ల్ సిఇఒ శ్రీనివాస ప్రసాద్, టూరిజం ఆర్‌డి రమణ కుమార్, సిపిఒ హాజమతయ్య, కడప ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

- జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్

ప్రజా శక్తి రాయచోటి

కేంద్ర, రాష్ట్ర చట్టం కింద నమోదు చేసిన ఏదైనా చట్టపరమైన సంస్థ, కో-ఆపరేటివ్ సొసైటీ, ఏదైనా ట్రస్టు, వాహన తయారీదారులు, ఎన్‌జిఒల నుంచి డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ దరఖాస్తులను జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ లోపల సమర్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా డ్రైవింగ్ శిక్షణ కోసం వీలైనన్ని ఎక్కువ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు అవసరమున్న నేపథ్యంలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు రవాణా శాఖ అనుమతులు ఇస్తుందన్నారు. శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఆర్థిక సాయం కూడా ఇస్తుందని, దీనిని ఏర్పాటు చేయబోయే వారు వినియోగించుకోవచ్చన్నారు. జిల్లాలో డ్రైవింగ్ శిక్షణకు అవసరమయ్యే ప్రమాణాలతో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చన్నారు. ప్రతి 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం మంజూరు చేస్తారన్నారు. జనాభా 10-20 లక్షలు ఉంటే మరో శిక్షణ కేంద్రం మంజూరు చేస్తారన్నారు. జిల్లాలో రెండు డిటిసిలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ దరఖాస్తులను కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనను పంపుతారని ఆ శాఖ అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. ఎంపిక చేసిన ఏజెన్సీ తమ ప్రాజెక్ట్ ఖర్చులో 85 శాతం మేరకు సహాయం పొందుతుందని తెలిపారు. ప్రతి డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి గరిష్ఠంగా రూ. 2.50 కోట్ల వరకు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు రెండు ఎకరాల సొంత భూమి, లీజుకు తీసుకున్న భూమి అవసరమవుతుందన్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్


విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిసిఒ ఉదయశ్రీ

'గురుకులం'లో పిల్లలకు అశ్లీల పాఠాలు

- ఉపాధ్యాయురాలిని నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పీలేరు

గురుకులంలో విద్యార్థినులకు చెప్పాల్సిన పాఠాలకు బదులు అశ్లీల, అసభ్యకర పాఠాలు ఓ ఉపాధ్యాయురాలు నేర్పుతోందని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలిని నిలదీసిన సంఘటన శుక్రవారం అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. అక్కడ చదువుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సి.పరిమిళ అనే గణిత ఉపాధ్యాయిని ఈ విద్యా సంవత్సరంలో ఇక్కడ విధుల్లో చేరింది. ఈమె వ్యవహారశైలి తొలి నుంచీ వివాదాస్పదంగా మారింది. విద్యార్థినులు పట్ల చులకన భావం ప్రదర్శిస్తూ, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలకు బదులు అసభ్యకర అంశాలను పాఠాల రూపంలో చెపుతూ వస్తుందని, అశ్లీలతతో కూడిన అంశాలను విద్యార్థినులకు వివరిస్తూ ప్రేరేపించేదని, పెళ్లికాని యువతులు ఎలా ఉండాలో చెబుతూ, వివాహమైన అనంతరం భర్తతో ఎలా మెలగాలో చెప్పుకొస్తుండేదని, ఇందతా చూస్తూ వచ్చిన విద్యార్థినులు ఈమె చేస్తున్నదంతా వారి తల్లిదండ్రులకు చెప్పి, విషయాన్ని పేపర్లో రాసి పాఠశాల ఆవరణంలోని ఫిర్యాదుల బాక్సులో వేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది. నాలుగు రోజులుగా సెలవులో ఉన్న పరిమిళ శుక్రవారం విధులకు హాజరైంది. విషయం తెసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులానికి చెరుకుని, సంబంధిత ఉపాధ్యాయురాలిని నిలదీశారు. ఈ టీచర్ మా పిల్లలకు వద్దంటూ నినదించారు. ఇదే విషయమై గురుకుల ప్రిన్సిపల్ బేబీ కరుణ మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సంబందిత ఉపాధ్యాయురాలు పరిమిళకు సోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె నుండి వచ్చే సమాధానాన్ని ఉన్నతాధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న డిసిఒ ఉదయశ్రీ శుక్రవారం పొద్దుపోయాక గురుకుల పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విషయమై సొసైటీ కార్యదర్శితో ఫోన్లో డిసిఒ మాట్లాడి పరిస్థితిని వివరించారు. స్పందించిన సొసైటీ కార్యదర్శి ఆరోపణలు ఎదుర్కొంటున్న గణిత ఉపాధ్యాయురాలిని సెలవుపై వెళ్ళాలని ఆదేశించారు. తాము శాఖ పరమైన చర్యలు చేపట్టాక తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందుకోవాలని సొసైటీ కార్యదర్శి ఆదేశించినట్లు తెలిసింది.

లోకేష్‌ను కలిసిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విద్యాశాఖ నారా లోకేష్ బాబు తెలియజేసినట్లు చమర్తి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పథకాల ద్వారా లబ్ధి పొందే వారికి జరిగే మేలును వివరించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని నారా లోకేష్ బాబు సూచించారని తెలియజేశారు.


లోకేష్‌తో చమర్తి

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ విజేతలు విశాఖ, అనంత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 ఫుట్‌బాల్ విజేతలుగా విశాఖపట్నం, అనంతపురం జట్లు నిలిచాయి. మూడు రోజులుగా స్థానిక గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ హైస్కూల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య, చంద్రమాకులపల్లి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-14 బాలుర విజేతలుగా విశాఖపట్నం, బాలికల విజేతగా అనంతపురం జట్లు నిలిచాయి. మొదటగా బాలుర ఫైనల్స్‌లో విశాఖపట్నం, చిత్తూరు జట్లు తలపడగా విశాఖపట్నం రెండు గోల్స్‌తో చిత్తూరుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. బాలికల ఫైనల్స్‌లో అనంతపురం జట్టు కడప జట్టుపై రెండు గోల్స్‌తో విజేతగా నిలిచిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్.బాబు, అడ్మిన్ కార్యదర్శి శారద, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై విజేతలకు ట్రోఫీ, మెడల్స్ ప్రదానం చేసి, విజేతలైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయి స్కుల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-14 జట్టుకు ఎంపిక చేసినట్లు అబ్జర్వర్ పాల్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు అన్సర్, కిరణ్, దిలీప్, మహేంద్ర, ఉమాదేవి, వరలక్ష్మి, భారతి, నాయక్, బాలాజీ, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు : డిపిఎం


పంట కోత ప్రయోగం చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పంటలను సాగు చేయడం ద్వారా రైతన్నలకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. శుక్రవారం రాయచోటి రూరల్ మండలం పరిధిలోని ఎండపల్లి గ్రామం జంగంరెడ్డిగారిపల్లెలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో మహిళా రైతు జయమ్మ వేరుశనగ పొలంలో 5x5 పద్ధతిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ప్రయోగానికి ముందుగా పొలంలో వేరుశనగ పంటలో పెసలు, నువ్వులు విత్తడం ద్వారా ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డిపిఎం వెంకట మోహన్ మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేరుశనగ పంట సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గి, భూసారం పెరిగి, దిగుబడి కూడా ఎంతో మెరుగుపడుతున్నట్లు తెలిపారు. వేరుశనగ పంటలో పెసలు, నువ్వులు చల్లి 365 రోజులు భూమిని కప్పిఉంచే విధంగా చేయడంతో పాటు కంది, అలసంద, పెసర, ఆముదం, మొక్కజొన్న, గోరుచిక్కుడు, బెండ వంటి అనేక అంతర పంటలు వేయడం వలన భూమికి బలం చేకూరుతుందన్నారు. అదనంగా సజ్జ, జొన్న వంటి రక్షక పంటలు విత్తనం వల్ల చీడపీడల ముప్పు తగ్గి ఖర్చులు కూడా తగ్గుతా యని తెలిపారు ,అన్ని రకాల అంతర పంటలు, ఎర పంటలను కలిపి సాగు చేయ డం ద్వారా వేరుశనగ పంట దిగుబడి గణనీ యంగా పెరిగినట్లు చెప్పారు. వేరుశనగ ఏ గ్రేడ్ మోడల్ లో అంతర పంటల ద్వారా మంచి అదనపు ఆదాయం రావడం జరిగిందన్నారు. 5x5, వంటకోత ప్రయోగంలో 8.50 కిలోల వేరుశనిగ లభించాయని, దీని ఆధారంగా ఎకరాకు సుమారు 22 బస్తాల దిగుబడి వస్తుంది తెలిపారు. ప్రతి రైతు ప్ర కృతి వ్యవసాయం వైపు అడుగుపెట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలని, ఆరో గ్యకరమైన ఆహారాన్ని పండించాలని రైతులకు సూచించారు కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం మూసివేత బాధాకరం : నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దశాబ్దాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్న త్యాగరాజు వీధిలోని గ్రంథాలయం మూసి వేయడం బాధాకరమని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 20వ వార్డులో మెడికల్ కళాశాలల పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరుద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు గ్రంథాలయం ఉపయోగంగా వుండేదని వివరించారు. మూసి వేసిన గ్రంథాలయాన్ని వెంటనే తెరిపించాలని అధికారులను కోరారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య కళాశాల విషయంలో వైసిపి పోరాటం ప్రజల్లో చైతన్యం నింపిందని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు దీనికి నిదర్శనమన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి పనులు జరగడంలేదని, సంక్షేమ పథకాలు అరకొరగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మానుజారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటాచలపతి, కౌన్సిలర్లు ప్రసాద్ బాబు, ఈశ్వర్ నాయక్, రాజేష్, రజిని, చరణ్, శారద రెడ్డి, సీనియర్ నాయకులు రహమతుల్లా, ఇర్ఫాన్ ఖాన్, రోలింగ్ మల్లిక, నాగమణి, జైశ్రీ, పద్మప్రియ, ఇర్ఫాన్, ధనలక్ష్మి, నూర్ ఖాన్, యూనిస్, షానవాజ్, వెంకటేష్, ఆవుల విశ్వనాథ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


విద్యార్థులతో డిఇఒ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు

మాక్ అసెంబ్లీకి ఏడుగురు విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 26న అమరావతిలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ, రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం డైట్‌లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు శాసనసభ సమావేశాల నిర్వహణ విధానం, ప్రశ్నోత్తరాల సమయం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విధులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు ఎం.పార్థసారథి(నిమ్మనపల్లె), కె.తేజశ్రీ (పీలేరు), జె.అనిల్‌కుమార్ (బి.కొత్తకోట), ఎం.సుష్మతాజ్ (రాయచోటి), కొల్లి వీక్షిత (వీరబల్లి), ఎస్.నూర్ ఆయేషా (పెనగలూరు), పట్నంరెడ్డి సాయి (రాజంపేట) విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అద్భుత అవకాశం జిల్లాకు చెందిన విద్యార్థులకు లభించడం గర్వకారణమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థపై అవగాహన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గైడ్ టీచర్స్ శివారెడ్డి, రామలక్ష్మి, విద్యార్థులు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఎపిఒ చంద్రశేఖర్, ఎఎస్ఒ భాస్కర్ పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ

- ఐఎంఎ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజాసాహెబ్

ప్రజాశక్తి-పీలేరు

ముందస్తు వైద్య పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ సాధ్యమే అని అందుకు సంపూర్ణ అవగాహన చాలా అవసరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజసాహెబ్ తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని అయ్యప్ప రెడ్డి కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు శాఖ ఆధ్వర్యంలో 'కేన్సర్‌పై విజయం-స్క్రీనింగ్‌తో సాధ్యం' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో స్థానికంగా వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని కేన్సర్ నివారణా చర్యలు తెలియజేశారు. విద్యార్థులకు కేన్సర్ రకాలు, వాటి తీవ్రత, లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై వైద్యుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాధారణ స్థాయికి మించి శరీరముపై అసహజ కణాలను (కణితి) అనుమానించి, వ్యాధి నిర్ధారణ అనంతరం సత్వర చికిత్సల అవసరాన్ని గుర్తించాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలితో పాటు ప్రమాదకారకాల నుండి యువత దూరంగా ఉండాలని తెలిపారు. కేన్సర్ కొందరికే వస్తుంది నాకు రాదనే అపోహ ఎవరికీ వద్దని పేర్కొన్నారు. ఎయిడ్స్, హెచ్‌పివి టీకా ఆవశ్యకతను ప్రతి యుక్తవయస్సు బాలిక గుర్తించాలని, శరీరంలోని అసాధారణ లక్షణాలు సంబంధిత వైద్యనిపుణుల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం ఏమాత్రం క్షేమం కాదని వైద్యుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజా సాహెబ్, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డాక్టర్ మమత లక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ మానస, డాక్టర్ మధురిమ, డాక్టర్ హీనా, డాక్టర్ తాహిర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రూపానందరెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజల సమస్యలను పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహించినట్లు రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాఘవ రాజపురం టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు తరలి తమ సమస్యలపై రూపానందరెడ్డికి అర్జీలు సమర్పించారు. ప్రజల వినతులు ఆలకించి వెంటనే, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి తక్షణం ఫోన్ చేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న పలు పంచాయతీ సమస్యలు, వ్యక్తిగత, సామాజిక సమస్యలు, రేషన్, విద్యుత్, రహదారులు, నీటి సమస్యలు, వైద్యానికి సంబంధించిన ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ ప్రజా దర్బార్ నిర్వహణకు వచ్చిన ప్రతి పౌరుడికి సమాన ప్రాధాన్యం ఇచ్చి, వారి సమస్యలు త్వరగా పరిష్కరించబడాలని పార్టీ నాయకత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పరి పాలన చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్ గౌడ్, సూరపరాజు సుబ్బరాజు, విపిఆర్ కండ్రిక సొసైటీ అధ్యక్షులు డి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ

ప్రజాశక్తి-గాలివీడు

సమాజ భాగస్వామ్యంతోనే మలేరియాను నియంత్రించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య పేర్కొన్నారు. మండలంలోని పెదకంటి కొత్తపల్లిలో దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు జ్వరాల వ్యాప్తి, నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక పిహెచ్‌సి సిబ్బందితో కలసి డాక్టర్ ఆధ్వర్యంలో ఇంటింటి లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదమన్నారు. తీవ్రజ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనురెప్ప కళ్ళు తిప్పలేకపోవడం, శరీరం పై దద్దుర్లు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మల్లికార్జున, అయ్యవారయ్య, వసంత, కళ్యాణి, రమాదేవి, లక్ష్మీదేవి, నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సర్వర్ సమస్యతో ఆగిన బ్యాంకు సేవలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో గాలివీడు, నూలివీడులో శుక్రవారం ఆన్‌లైన్ సర్వర్ సమస్యతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిచిపోయాయి. బ్యాంకు సమయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సర్వర్ పని చేయక పోవడంతో బ్యాంకు లావాదేవీలు ఆగిపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

రాయచోటి డివిజన్ పరిధిలోని వినియోగదారులకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఇ యుగంధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి టౌన్‌లోని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు అర్థం చేసుకొని సహకరించవలసినదిగా కోరారు. రాయచోటి పరిధిలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖ ఉద్యోగులను సంప్రదించాలన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

ప్రజాశక్తి - నందలూరు

విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎఇఒ అనంత కృష్ణ, నాగిరెడ్డిపల్లె జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోగల అరవపల్లె గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం సెల్ ఫోన్లు వాడడం ద్వారా ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని అన్నారు. పుస్తక పఠనం చేస్తే జ్ఞానంతో పాటు మంచి ఆరోగ్యం మంచి ఆలోచనలు వస్తాయని భవిష్యత్తులో మంచి పౌరుడిగా ఎదిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని రోజుకి కొంత సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించాలని తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జ్ఞాన దీప్తి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ, గ్రంథాలయాధికారి రవి శంకర్‌రాజు, నాగిరెడ్డిపల్లి ఉపాధ్యాయుడు కృపానందం, మాచుపల్లి రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యనారాయణ

NOTICE

నా కక్షి దారుడైన శ్రీ జి కవిత W/o. జి శివ శంకర్, డోర్ నెం. 1-605/4, కడప రోడ్డు, పీలేరు, క్రింది వ్యక్తులు అయిన 1. కె రమణమ్మ W/o. కె వెంకట రమణ 2. కె వెంకట రమణ 3. కె మౌనిక W/o. కె.గిరి, 4. కె గిరి S/o. కె వెంకటరమణ, 5.కే మహిత D/o. కె వెంకటరమణ ల నుండి 2024 సంవత్సరములో చేతి రుణాలు తీసుకొని భద్రత కొరకు ఖాళీ చెక్కులు AXIS BANK వి ఇచ్చి యున్నారు, చెక్ నెంబర్లు 058446 నుండి 058448,058452, 058454 TO 058457, 058459 మరియు 058461 To 058466, మరియు సంతకాలు చేసిన ప్రామిసారి నోట్లు. పై వారికి నా కక్షి కర్త ఇది వరకే అన్ని బకాయిలను వడ్డీ తో సహా చెల్లించినారు, భద్రత పత్రాలు తిరిగి ఇవ్వమని కోరగా వారు తరువాత ఇస్తామని చెప్పి తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై పై వారికి ఇది వరకే లాయరు నోటీసు కూడా ఇవ్వడం జరిగినది. కాబట్టి ఈ నోటీసు ద్వారా తెలియ చేయడం ఏమనగా పైన పేర్కొన్న చెక్కులు మరియు ప్రామిసరి నోట్లు రద్దు చేయ బడ్డాయి అవి ఇక పై చెల్లు బాటు కానివి ఎవరైనా పై పేర్కొన్న చెక్కులు గాని ప్రామిసారి నోట్లు గాని ఉపయోగించిన యెడల వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకోనబడుతాయి.

ఇట్లు
తోట ప్రవీణ్ కుమార్
అడ్వకేట్, పీలేరు.

IN THE COURT OF THE PRL CIVIL JUDGE[JUNIOR DIVISION]: PILER
O.S.No. 121 OF 2021

Nethi Saraswathamma ...Plaintiff
Vs
P. Fathima Bee ...Defendant

SUIT SUMMONS TO THE DEFENDANT

P. Fathima Bee, W/o Sayed Khan, R/o Daramvari Palle, Doddipalli Village, Piler Mandal, Annamayya District, A.P.

The Plaintiff has instituted the above suit against you for Permanent injunction of the plaint schedule property. Your here by summoned to appear either in person or through an Advocate on 27-11-2025 at 10.30A.M. before the above court to answer the suit and to file the objections if any, if you failed to appear on the above date, the matter will be decided ex-parte in your absence.

//By Order of the Court//

M.MADHSUDHANA REDDY,
Advocate for Plaintiff

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత : డిఎల్‌పిఒ



పుల్లంపేట : చెత్తను శుభ్రం చేస్తున్నఎంపిడిఒ జయశ్రీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని విపిఆర్ కండ్రిక గ్రామపంచాయతీలో డిఎల్‌పిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో నిర్వహించారు. విపిఆర్ కండిగ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి సేకరించారు. వీధులను శుభ్రం చేసి,ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త లను వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు.పొడి చెత్తకు సరుకులు ఇస్తామని వారికి అవగాహన కల్పించారు. సేకరించిన పొడి చెత్తను చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించారు.తదుపరి గ్రీన్ అంబాసిడర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించుటకు చర్యలు చేపట్టవలసిందిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శ్రీ కాళహస్తి ఇటిసి నుంచిరమేష్, కోడూరు ఎంపిడిఒ నాగిరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ హరితమ్మ, సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యంరాజు, హరికృష్ణరెడ్డి, రామకృష్ణ, ఎం.సుబ్బయ్య, గోపి, హౌసింగ్ ఎఇ మురళి, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు పాల్గొన్నారు.**కలకడ:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. మండలంలోని కలకడ కొత్తపల్లి, ఇందిరమ్మ కాలనీలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ గార్డులు, సిఆర్‌పిలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి సేకరించినట్లు తెలిపారు.వీధులను శుభ్రం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ శైలజ, గ్రామపంచాయతీ సర్పంచ్ ప్యారిజన్ జవాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు ,గ్రీన్ గార్డులు, సిఆర్‌పిలు పాల్గొన్నట్లు తెలిపారు.**కలికిరి :** మండల కేంద్రం కలికిరిలోని అమరనాథ్‌రెడ్డి కాలనీలో ఎంపిడిఒ పి.భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపిడిఒ మొహమ్మద్ రియాజ్‌ఉద్దీన్ ఆధ్వర్యంలో పరిశుభ్రత, పచ్చదనంపై రెండవ రోజు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డోర్ టూ డోర్‌లో తడి చెత్త, పొడి చెత్త ను వేరు చేయడం, బిన్ బాగ్స్ విధానం తదితర అంశాల పై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో వారితో ముఖాముఖి నిర్వహించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, జె. సురేంద్రబాబు, మండల స్వచ్ఛ భారత్ మిషన్ రిసోర్స్ కో-ఆర్డినేటర్ శంకర్, పంచాయతి సెక్రటరీ లు, అశోక్, సతీశ్ కుమార్, గిరి, గంగాదేవి, గోపి పాల్గొన్నారు.**నిమ్మనపల్లె :** మండలంలోని గ్రామాలను పచ్చదనంగా పరిశుభ్రంగా ఉంచడమే మన లక్ష్యమని ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజులు అన్నారు. రెడ్డివారిపల్లి గ్రామ సచివాలయం వద్ద గ్రామాల పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమం పై మండలంలోని పంచాయితీ అభివృద్ధి అధికారులతో, పారిశుధ్య కార్మికులు, సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించి శిక్షణ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ప్రతి రోజు తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. పల్లెల్లోని వీధులను తరచూ శుభ్రం చేయాలన్నారు. మురుగనీటి కాలువలను, కాలువ గట్లపై ఉన్న గడ్డిని, చెత్తను తొలగించాలన్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించామన్నారు. సంపద తయారీ కేంద్రంలో ఎరువు తొట్టెలను శుభ్రపరిచి కొత్త చెత్త నుంచి ఎరువును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు గాయత్రి, గౌతమి, రజిత, రాజశేఖర్ నాయక్, నాగభూషణం, చిరంజీవి, రెడ్డి ప్రసాద్, మహమ్మద్, నాగరాజా, పారిశుధ్య కార్మికులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

చిన్నమండెం : ప్రజా పరిషత్ కార్యాలయంలో సభా భవనము థీమ్స్ -5 క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణా కార్య క్రమం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల సిఆర్‌పిలు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్ పంచాయతీ కార్య దర్శులు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని పుల్లంపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఒ జయశ్రీ అధ్యక్షతన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త లను వేరుచేసి సేకరించడం జరిగిందని వీధులను శుభ్రం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎఒ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.**రాజంపేట :** మండల కేంద్రంలోని ఊటుకూరు గ్రామపంచాయతీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వరప్రసాద్ మాట్లాడుతూ రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు విష జ్వరాల ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్ణాటకం చెంగల్ రాయుడు, జనసేన పార్టీ నాయకులు కే.ఎస్ నరసింహ, టిడిపి మండల ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, నామ హరినాథ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఉపాధిహామీ ఎపిఒసాలయ్య, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.**తంబళ్లపల్లి :** పచ్చదనం-పరిశుభ్రత గల గ్రామాల నిర్మాణానికి అందరం కృషి చేద్దామని నియోజకవర్గ ప్రత్యేక అధికారి అమరనాథ్‌రెడ్డి, ఎంపిడిఒబాపూజీ పట్నాయక్ అన్నారు. మండలంలోని ఎర్రసానిపల్లెలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ గ్రామాల్లో ఇళ్లిళ్లు తిరిగి చెత్తను సేకరించాలన్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి కంపోస్ట్ ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు.



కలకడ :పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సు



విద్యార్థికి బహుమతి అందిస్తున్న రెడ్డిశేఖర్

ప్రజాశక్తి కలికిరి

మండల పరిధిలోని మేడికుర్తి గ్రామంలో ఎన్ఎస్ఎస్, రాప్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రెడ్డిశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయరంగంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక విజ్ఞానం గురించి, కొత్త వ్యవసాయ పద్ధతులను గురించి తెలియజేశారు. కెవికె ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్ ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రైతులు వారి సహకారాన్ని అందించాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నాగప్రసాద్ మాట్లాడుతూ రైతులకు టమోటా పంటలో వచ్చే సమస్యలను గూర్చి, ఎరువులు, పురుగుమందుల వాడకంలో మెలకువలను తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ కదిరి మోహన్ మాట్లాడుతూ రైతులు తమ సహకారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. మాజీ ఎంపిటిసి జనార్దన్ మాట్లాడుతూ రైతులు వారికి వచ్చే సమస్యలును గూర్చి కృషి విజ్ఞానం కేంద్రం వారిని సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ రంగంలో వచ్చిన సాంకేతిక పురోగతిని వ్యవసాయ ప్రదర్శన ద్వారా రైతులకు వివరించి చెప్పారు. ముఖ్యంగా సేద్య విభాగంలో ఈ ప్రాం తంలో పండించే పంటల రకాలను, నానో యూరియా, నానో డిఎపి, జీవన ఎరువులను ప్రదర్శించారు. ఉద్యానవన విభాగంలో అర్క భాను బంతినారు, మిరప (ఎల్‌సిఎ-657) నారు, వివిధ ఉద్యానవన పనిముట్లను ప్రదర్శించారు. సస్యరక్షణ విభాగంలో ఈ ప్రాంతంలో వచ్చే చీడపీడలను, తెగుళ్లను, ఎర బుట్టలను ప్రదర్శించారు. గృహ విజ్ఞాన విభాగంలో తేనెటీగల పెంపకం, పుట్ట గొడుగుల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, విలువ జోడింప చేసే వివిధ పచ్చడులు, పోడులను, సేంద్రీయ వేరుశనగ నూనెను, కొబ్బరి నూనెను ప్రదర్శించారు. అనంతరం చిత్రలేఖన పోటీలో గెలిచిన పాఠశాల విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. కళాశాల విద్యార్థులు తమ రాప్ అనుభవాన్ని రైతులతో పంచుకున్నారు. శాస్త్రవేత్తలు సమక్షంలో పంట సాగులోని సమ స్యలను రైతులు నివృత్తి చేసుకున్నారు. జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శనలను సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం రాఘవేంద్ర, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జ్యోతి, శాస్త్రవేత్త డాక్టర్ శాంతి కుమారి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మాధురి, డాక్టర్ సోమశేఖర్‌బాబు, ఎఒ హేమలత, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, గ్రామ సహాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, విఎఎస్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వైసిపి నిరంతర పోరాటం చేస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలం, పోతుపేట పంచాయతీ, టి.సదుం పంచాయతీల్లోని గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకి స్థానిక ప్రజలు, వైసిపి నాయకులు, ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా పిపిపి విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయిన నూతన పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. త్వరలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన హెచ్చ రించారు .కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, పిటిఎం బూత్ కమిటీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, పట్టణం వైసిపి కన్వీనర్ సి.ఆర్ చిన్నికృష్ణ, సచివాలయ మాజీ నగర్ జి.చాంద్‌బాషా, బిసి కాలనీ బాబాజాన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఎర్రచెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణానికి దండు నాగేశ్వరావు సతీమణి దండు శ్రీవాణి , కుమారుడు దండు వెంకట వశిష్ట్ రూ.20వేలు విరాళంగా ఇచ్చినట్లు దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు ఏనుగుల బాలాంజనేయులు తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమం లో కమిటీ సభ్యులు మేడా వెంకటకుమార్, పెమ్మానబోయిన యల్లయ్య, తోట శివశంకర్, ముమ్మడిశెట్టి సుధాకర్, రాచురి మురళి,బెస్త సుబ్రహ్మణ్యం, రాము పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రతి కుటుంబానికి పక్కా గృహాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం హౌసింగ్ ఎఇ జనార్ధన్‌తో కలిసి మండల పరిధిలోని మర్రిచెట్టు సమీపంలో ఉన్న పూసల కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా షఫీ నాయక్ మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు పూసల కాలనీలో ఎంతో మంది నిరుపేద కుటుంబాలు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారో పరిశీలించామన్నారు. వెంటనే నిరుపేద కుటుంబాలను గుర్తించి ఈ నెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. నిరుపేద కుటుం బానికి ఇళ్ల నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో పాటు ఆయన సోదరులు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జనార్దన్, సిబ్బంది బాబ్జీ, పవన్, నాయకులు బాబు, అహ్మద్, శ్రీనివాసులు, లబ్ధిదారులుపాల్గొన్నారు.



పూసలకాలనీ వాసులతో మాట్లాడుతున్న షఫీనాయక్



ట్రాక్టర్‌లో తరలిస్తున్న మట్టి

యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణా

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో అనుమతులు లేకుండా అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. జెసిబిలతో కొండలు, గుట్టలను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం 5 మట్టి ట్రాక్టర్లు తహశీల్దార్ కార్యాలయం ఉండే రోడ్డుపైనే తీసుకెళుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు చర్చించుకున్నారు. కొండలను చదును చేసి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న వారిపైన చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అక్రమ మట్టి రవాణపై తహశీల్దార్ జె.భాగ్యలతను వివరణ కోరగా సంఘటన స్థలానికి విఆర్‌ఒను పంపి విచారణ చేస్తామని చెప్పారు. అనుమతులు లేకుండా మట్టి రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుటామని తెలిపారు.

అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లా పరిధిలోని గ్రామపంచాయతీలలో ఎటువంటి అనుమతులు లేకుండా చేపట్టిన అనధికార నిర్మాణాలకు క్రమబద్ధీకరించుకోవాలని ఉమ్మడి కడప,అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలలో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఈనెల 12న జిఒ నెంబర్ 225 ను విడుదల చేసిందని తెలిపారు. ఈ జిఒ ప్రకారం 125 రోజులలోపు లైసెన్స్ టెక్నికల్ సర్వీస్ ద్వారా దరఖాస్తు చేసుకొని బిపిఎస్‌లో భవనాలను క్రమబద్ధీకరించుకొని అనధికార నిర్మాణాలపై విధించే జరిమానాలు కూల్చివేతలు కేసుల నుంచి రక్షణ పొందాలన్నారు. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు కూడా అర్హత ఉంటుందన్నారు. జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీలలో అనధికార నిర్మాణం నిర్మాణాలు, అనుమతికి విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు.

రుణాల చెల్లింపుల బాధ్యత విఒలదే

ప్రజాశక్తి-రామాపురం

డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లింపుల బాధ్యత విఒలదేనని వెలుగు ఎపిఎం దేవసేన పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో డ్వాక్రా సంఘాలు ఉన్నాయని బ్యాంకులలో సంఘ సభ్యులకు రుణాలను ఇప్పించి సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా వారికి అవగాహన కలిగించి సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా సంఘాలు సమావేశాలను నిర్వహించుకొని గ్రామంలో కావాల్సిన అభివృద్ధి పనులు సభ్యుల సమస్యలను చర్చించుకుని తీర్మానాలు చేసుకోవాలన్నారు. పుస్తక నిర్వహణ పై సభ్యులకు తప్పక అవగాహన కలిగించాలన్నారు. విఒఎల సభ్యులకు నుంచి స్త్రీనిధి రుణాలు వ్యక్తిగత రుణాలు ఇస్తూ వాటిని సకాలంలో తిరిగి చెల్లించే విధంగా సభ్యులను కార్యోన్ముఖుల చేయాలన్నారు. ఎక్కడైనా సంఘాలు వెనుకబడి ఉంటే ఆ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిసిలు నాగరాజు, గంగాధర్‌రాజు, రెడ్డిబాబు, 13 పంచాయతీల విఒఎల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం దేవసేన

క్రైం కార్నర్

క్షణికావేశంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాలేజీకి వెళ్లి తన బిడ్డ చదువుకోవాలని, తాము మట్టిలో పడే కష్టాలు తన బిడ్డ పడకుండా ప్రయోజకుడు కావాలని కలలుకన్న ఆ తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చాడు. రామసముద్రం మండలం, ఎలక పల్లె గ్రామం, జక్కం వారిపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు అభిషేక్(17) రామసముద్రం జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదువుతున్నాడు. ఇటీవల సక్రమంగా కళాశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అభిషేక్ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లెలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చిన్న చిన్న కారణాలకు ఎంతో మంది క్షణికావేశంలో తమ ప్రాణాలను తీసుకుంటున్నారు. విద్యార్థి దశలో కౌన్సెలింగ్ ఇస్తే ఇలాంటివి అడ్డుకోవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లె సైదాపేటకు చెందిన అతుల్, తహసీన దంపతులు సొంత పనిపై నిమ్మనపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. మార్గ మధ్యంలోని సచివాలయం వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనానికి సైడ్ ఇచ్చేక్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ గాయపడడంతో స్థానికులు వెంటనే బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతుకు..

మదనపల్లె అర్బన్ : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ఈ ప్రమాదంలో రైతు కాళ్లు, చేతులు విరిగడంతో పరిస్థితి విషమంగా ఉంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని దిగువ బోయపల్లికు చెందిన రైతు సి. నరసింహులుసొంత పని మీద కురబలకోట కు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి నడుచుకుని వెళ్తుండగా కురబలకోట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును గమనించిన స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

10 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పదిమంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు మదనపల్లె రెండవ పట్టణ సిఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైయస్సార్ కాలనీ వద్ద పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు.. సిబ్బందితో వెళ్లి పేకాట స్థావ రంపై దాడులు జరపగా, పదిమంది జూదరులు పట్టుబడినట్లు చెప్పారు. పట్టుబడ్డ పేకాట రాయళ్ళ వద్ద నుంచి రూ.24,500లు నగదు, పది మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటో ను సీజ్ చేశామన్నారు. నిందితులపై ఎపి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు.